


ఇయాన్ షికారు

ఆటిజం అబ్బాయి కథ

లారీ లియర్స్, బొమ్మలు: కరెన్ రిట్జ్, తెలుగు: కె. సురేష్



ఈ రోజు చాలా ఆహ్లాదంగా ఉంది. తారా అక్కతో పార్క్‌కి వెళ్లి బాతులకు మేత తినిపిద్దామని అనుకున్నాను. అయితే, సమస్య ఏమిటంటే మా తమ్ముడు కూడా మాతో వస్తానంటున్నాడు.

“ఇయాస్, నువ్వు ఇంటి దగ్గరే ఉండొచ్చు కదా?” అన్నాను. ఇయాస్ బదులివ్వలేదు. అద్దం మీద వేళ్లతో గట్టిగా కొడుతూ ఏడుస్తున్నాడు. మా తమ్ముడు ప్రత్యేక బాలుడు – అతడికి ఆటిజం ఉంది.


“సర్లే, పద ఇయాన్,” అన్నాను.


“తమ్ముడిని మాతో తీసుకుని వెళ్లవచ్చా?” అమ్మని అడిగాను.

“తీసుకుని వెళ్లు,” అమ్మ అంది. “వాడిని ఎప్పుడూ ఒక కంట కనిపెడుతూ ఉండాలి. ఆ పని చెయ్యాలని ఉందా?”

“ఆ, చేస్తాను,” నేను బదులిచ్చాను.

అంగీకారంగా తారా కూడా తల ఊపింది. “నువ్వు అతడి చెయ్యి పట్టుకుని ఉండాలి, జూలీ,” అని అక్క చెప్పింది.




POWER POPS

ఇతరుల మెదడు లాగా ఇయాస్ మెదడు పనిచెయ్యదు. వస్తువులను అతడు చూసే దృష్టి వేరే రకంగా ఉంటుంది...

హోటల్ పక్క నుంచి వెళుతుంటే ఇయాస్ లోపలికి వెళ్లి గుండ్రంగా తిరుగుతున్న పంకా కేసి చూస్తాడు. సాండ్‌విచ్, ఐస్‌క్రీంతో వెళుతున్న సర్వర్‌ని చూడడు.

"కూల్‌డ్రింక్ తాగుదాం!" అని నేను అన్నా పట్టించుకోడు. చెయ్యిపెట్టి బయటకు లాగేవరకు మెడ ఎత్తి పంకా కేసి చూస్తూనే ఉంటాడు.





EARLY
Special
$2.49
BEARS
BEARS
BEARS
BEARS



శబ్దాలను ఇయాస్ వినే విధానం కూడా వేరేగా ఉంటుంది...

పెద్దగా సైరస్ మోగిస్తూ తన ముందునుంచే వేగంగా వెళుతున్న ఫైర్ ఇంజన్‌ని ఇయాస్ పట్టించుకోడు.

కానీ నాకు వినపడని శబ్దాన్ని దేనినో వింటున్నట్టు తల పంకించి ఆలకిస్తూ ఉంటాడు. “పద వెళదాం!” అని చెయ్యి పట్టి లాగేవరకు అతడు అలాగే వింటుంటాడు.




వస్తువులను ఇయాన్ వాసన చూసే విధానం కూడా వేరేగా ఉంటుంది...

పూల దుకాణంలో మంచి వాసన వచ్చే లేత నీలం రంగు పూల గుత్తిని నేను ఇయాన్ ముక్కు దగ్గర ఉంచాను. కానీ, ఇయాన్ ముక్కు విరిచి ముఖం పక్కకి తిప్పేసుకున్నాడు.

మేం పోస్టాఫీసు పక్క నుంచి వెళుతున్నప్పుడు ఇయాన్ తన ముక్కును వేడిగా ఉన్న గోడ దగ్గరకి తీసుకుని వెళ్లి ఎర్ర ఇటుకల వాసన చూశాడు.

“ఆపు!” నేను అరిచాను. “అలా చేస్తే పిచ్చి వాడివని అనుకుంటారు!” ఎవరూ చూడక ముందే నేను ఇయాన్‌ని అక్కడి నుంచి లాక్కుని వెళ్లిపోయాను.







వస్తువుల స్పర్శను కూడా ఇయాన్ వేరేగా అనుభూతి చెందుతాడు...

చెరువు ఒడ్డున నేను ఒక మెత్తటి ఈకను ఇయాన్ గడ్డం కింద ఆడిస్తానా! అతడు తుమ్మి దానిని దూరంగా తోసిపారేశాడు.

తారా, నేను బాతులకు మేత వేస్తున్నప్పుడు ఇయాన్ పక్కకి పడుకుని బుగ్గని గరుకు గచ్చుకి ఆనిస్తాడు.

"లేచి పద, ఇయాన్" నేను అతడి చెయ్యి పట్టుకుని లేపాను. "పొరపాటున ఎవరైనా నిన్ను తొక్కుతారు!"





ఇయాన్ రుచి కూడా వేరేగా ఉంటుంది…

బేకరీ పక్క నుంచి వెళుతుంటే పేస్ట్రీ, పిజ్జా, పఫ్‌ల మీదకి అతడి దృష్టి పోనే పోదు.

కానీ నా జేబులో నిన్నటి నుంచి ఉండిపోయిన పాప్‌కార్న్‌ని తింటానని అంటాడు.

“ఇప్పుడు పాప్‌కార్న్ తినాలని తారాకి, నాకు లేదు,” ఇయాన్‌తో చెప్పాను. “నాతో పద పిజ్జా తిందువుగాని.”


కానీ ఇయాన్‌కి పిజ్జా తినాలని లేదు, అతడు ఒక్కటొక్కటిగా పాప్‌కార్న్‌ని నోట్లో వేసుకుని తింటున్నాడు.


అప్పుడప్పుడు నాకు ఇయాన్ మీద చాలా కోపం వస్తుంది!


DONUTS
BEARS
BEARS
BEARS
BEARS

“నేను పిజ్జా తీసుకుని వస్తాను,” తారా అంది. “ఇయాన్‌తో నువ్వు ఇక్కడే ఉండు, జూలీ.”

నేను బల్ల మీద కూర్చుని ఎదురు చూస్తూ ఉన్నాను. “నా పక్కన కూర్చో, ఇయాన్,” అంటూ తమ్ముడిని పిలిచాను. అతడు చెయ్యి విదిలించుకుని నన్ను పట్టించుకోను కూడా పట్టించుకోలేదు.





కొంత సేపటికి రెండు పిజ్జాలతో తారా వచ్చింది.

“ఇయాన్ ఎక్కడ?” ఆమె అడిగింది.

ఇయాన్ నిలబడి ఉన్నాడనుకున్న చోటుకేసి చూశాను... కానీ, ఇయాన్ అక్కడ లేడు!


కొంచెం సేపటి వరకు నాకు ఏమీ పాలుపోలేదు. నేను ఉన్న చోటు నుంచి కదల లేక పోయాను.



తారా పరిగెత్తుకుంటూ ఒక ఆవిడ దగ్గరకు వెళ్లింది. "నీలం రంగు టీషర్టు వేసుకున్న ఒక అబ్బాయిని చూశారా?" ఆమె ఏడుస్తూ అడిగింది.

ఆవిడ తల అడ్డంగా ఊపింది. "పార్కు బయట ఫుట్‌బాల్ ఆట చూస్తున్నాడేమో," అని ఆవిడ చెప్పింది.


కానీ ఇయాస్‌కి ఫుట్‌బాల్ ఆట పట్ల ఏమాత్రం ఆసక్తి లేదు.



భుజాల మీద ఒక చిన్న పిల్లవాడిని ఎత్తుకుని ఉన్న ఒకాయన అప్పుడు నాకు కనిపించాడు. “మన లోకంలో ఉన్నట్టు అనిపించని ఒక పిల్లవాడిని మీరు ఏమైనా చూశారా?” అతడిని నేను లోగొంతుకలో అడిగాను.

“లేదు,” అతను బదులు ఇచ్చాడు. “కథలు చెప్పే వ్యక్తి దగ్గరకు మేం వెళుతున్నాం. బహుశా ఆ అబ్బాయి కూడా అక్కడ ఉంటాడేమో.”

కానీ కథలంటే ఇయాస్‌కి ఇష్టమేమీ లేదు.






ఇయాన్‌ని వెతకడానికి తారా అటూ, ఇటూ పరిగెత్తుతోంది. నేను నా కళ్లు మూసుకుని ఇయాన్ లాగా ఆలోచించటానికి ప్రయత్నించాను.

బెలూన్లలోకి గ్యాస్ నింపే యంత్రం అంటే ఇయాన్‌కి ఇష్టం. పెద్ద చప్పుడు చేస్తూ దాంట్లోంచి గ్యాస్ వచ్చి రంగురంగుల బెలూన్లను పెద్దగా చేస్తుంది.

మంచి నీళ్లు వచ్చే పంపు అంటే కూడా ఇయాన్‌కి ఇష్టం. పంపు దగ్గరకల్లా ముఖాన్ని పెట్టి ప్రవహిస్తున్న నీటిని చూస్తూ ఉండేవాడు.

అదే సమయంలో పార్క్‌లో ఉన్న పాత కాలపు నాటి గంట గణ, గణ, గణ అంటూ మోగసాగింది. ఆ గంట అంటే కూడా ఇయాన్‌కి ఎంతో ఇష్టమని నాకు అప్పుడు గుర్తుకు వచ్చింది.





దాంతో నేను పార్కులో గంట ఉన్న చోటుకి వేగంగా పరిగెత్తుకుంటూ వెళ్లాను. ఇయాస్ అక్కడే ఉన్నాడు! గంట కింద హాయిగా పడుకుని దానికి ఉన్న తాడును లాగుతూ ఉన్నాడు. నేను అతడిని గట్టిగా హత్తుకున్నాను. కానీ, ఇయాస్‌పై అది ఎటువంటి ప్రభావమూ చూపలేదు.



అంతలో ఉయ్యాల దగ్గర తారా కనిపించింది. నేను గట్టిగా అరిచి ఆమెను పిలిచాను.


ఆమె పరిగెత్తుకుంటూ వచ్చి మా ఇద్దరి చుట్టూ చేతులు వేసింది.






"మనం ఇంటికి తిరిగి వెళదాం – ఇప్పుడు నీకు ఇష్టమైనవి నువ్వు చెయ్యవచ్చు!" ఇయాన్‌తో నేను అన్నాను.

తిరుగు దారిలో చెరువు దగ్గర మేం ఆగాం. అక్కడ ఇయాన్ కొంచం సేపు రాళ్లతో ఆడుకున్నాడు. దారిలో ఆ రాళ్లను వరసలో పేర్చాడు. ఇయాన్ చేతులను ఎవరూ తొక్కకుండా నేను అంత సేపు పక్కనే ఉన్నాను.







తరవాత మేం పూలు అమ్మే దుకాణం దాటి పోస్టాఫీసు వైపుకి వెళ్లాం. ఇయాన్ అక్కడ ఆగి వేడిగా ఉన్న రాళ్ల వాసన చూశాడు. ఇయాన్ అలా చేయటం ఎవరైనా చూసినా నేను పట్టించుకునే దానిని కాదు.

ఒక మూలమీద ఆగి మాకు వినపడని శబ్దం ఏదో ఇయాస్ వింటూ ఉంటే మేం కూడా ఆగి దానిని వినటానికి ప్రయత్నం చేశాం.





హోటల్‌లో ఇయాన్‌తో కలిసి పైన ఉన్న పంకాను చూస్తుండి పోయాను. చివరికి నాకే కళ్లు తిరగసాగాయి.



చివరికి మేం ఇంటికి చేరుకున్నాం. “షికారు బాగుందా, ఇయాన్?” అని నేను అడిగాను. ఇయాన్ క్షణంసేపు నా వైపు చూసి నవ్వాడు.

ఇయాన్ షికారు

ఆటిజం అబ్బాయి కథ

లారీ, బొమ్మలు: కారెస్, అనువాదం: కె. సురేష్

పార్క్‌కి వెళ్లి ఆడుకుందామని అనుకుంది జూలి. కానీ, ఇయాన్ కూడా వస్తానని అన్నాడు. జాగ్రత్తగా చూసుకునేటట్టయితేనే అతడిని కూడా తీసుకుని వెళ్లమంది అమ్మ. అతడికి ఆటిజం – ఒక రకమైన మానసిక పరిస్థితి.

ప్రతి దానిని ఇయాన్ వేరే రకంగా చూస్తాడు. హోటల్‌లో అతడికి ఐస్‌క్రీం, సాండ్‌విచ్ అంటే ఇష్టం లేదు. అక్కడ పంకాకేసి అతడు చూస్తూ ఉంటాడు. పార్కులో అతడికి ఈకతో చక్కిలిగిలి పెడితే ఇష్టం లేదు. కానీ గట్టి నేల మీద బుగ్గ ఆనించి పడుకోవటం అతడికి ఇష్టం.

ఇయాన్‌ని అర్థం చేసుకోవటం జూలీకి కష్టంగా ఉంటుంది. పార్క్‌లో ఇయాన్ తప్పిపోయినప్పుడు ప్రపంచాన్ని మరో కోణం నుంచి చూడటం అంటే ఏమిటో జూలీ తెలుసుకుంది. ఇయాన్ ఎలా ఆలోచిస్తాడు అని ఊహించుకుని చివరికి అతడిని కనుక్కో గలుగుతుంది.